# వింత భావాలు

మల్లాది రామకృష్ణశాస్త్రి గారు

౧

—అది ఆతనికి మామూలయిపోయింది. ఏమీ తోచ నప్పుడల్లా వచ్చికూర్చుని కవిత్వించి పోట్లాడి పోతూంటాడు.

కాని ఆతనితో కబుర్లువేయడమంటే నాకమిత కులాసా ఆతను చెప్పేవేమీ—చేసేవేమీకాని— నాకు నచ్చవు. ఆసంగతి ఆతనికీ బాగా తెలుసును. అయినా ఎప్పుడో ఓమారైనా మాట్లాడకుండా—పోట్లాడకుండా—రోజుగడిచేదికాదు. అందుచేత నేమోకూడను—మాకిద్దరికీ అంతస్నేహం.

మామూలుకేళకే, మామూలుకన్నా మరీచక్కగా వేషంవేసుకొని, ప్రత్యక్షమైనాడు సుందరం—నాచదువు చెడగొట్టడానికి. దూరాన్నుంచే నాచేతులో పుస్తకం కనిపెట్టి, తమాషాగా, చిరునవ్వుతో నావైపే చూస్తూ వస్తున్నాడు: నేనూ అదిగ్రహించి, శాకుంతలంమూసేసి, సిగరెట్టు ముట్టించుకొని తయారుగా ఉన్నాను;

—మళ్ళా మొదలూ!

కోటిమీదకోటి ఎక్కుస్తున్నాడు: ఆతని ధోరణంతా వింతగా ఉన్నది:

‘అవును అలాగే ఉంటుంది అర్థంగాకపోతే’ అని ఈసడించాడు సుందరం.

నాకక్కడితో హుషారెక్కింది: ఇక ఊరుకో దలచలేదు:

‘అయితే, కవిత్వానికీ, వేషానికీ సంబంధమేముందీ?’ అని నేనందుకున్నాను.

‘తెలియకపోతే అలా అడుగు—దోవలోకిరా— ఏముందా? సోమయాజులుగారికీ శాలువకూ ఏంబాంధవ్యముందో, అంతకన్న—’

‘అంటే’

‘ఏపాటకి తగిన ఆట ఆపాటకి అమరాలన్నమాట చూళ్లేమూ? తత్త్వాలు వ్రాసిన బ్రహ్మంగారూ, సిద్ధయ్యగారూ సన్న్యాసులయినారు. శృంగారం కురిపించిన సూరన్నగారు—’

‘మహారసికులనే-కాదూ, నీవనబోయేది?’

‘అవును. ఆలోచనవరకే కాకుండా—అనుభవంలోకి తెచ్చుకున్న రసికత్వంకూడాను వారిది.’

‘అనుభవం లేకపోతేనేం—ఊహించ కూడదూ?’

సుందరం నవ్వాడు. నాకూ అది పిచ్చప్రశ్నే మో ననిపించింది.

‘సరే అనుగుణ్యమైన సంస్కారం అవసరమని—పోనీ—ఒప్పుకుంటాను: మరి ప్రత్యేకమైన నేపథ్యం ఎందుకూ’

‘అవసరమే!—తన నమ్మకానికీ, ఇతరులని నమ్మించడానికీ: రంభతో ఇంటర్వ్యూ ఆసించపోయే అవధాన్లగారు, వేసమంతా దిగవిడిచి, గావంచాతో బయలుదేరుతాడేమో కనుక్కో— పేస్‌పోర్టు కావద్దూ?—అందుకనే కవితాకన్యకు ప్రియుల మవుదామనుకునే మాదృశులు—

‘అదేమిటోయ్—నీవు కవివి కాదూ?—కవికన్న కూతురు కవికి ఏమవుతుంది?’

‘ఆఁ—ఏమవుతుందా?—వాణి బ్రహ్మకు ఏమవుతుందో—నిమ్మళంమీద అది అవుతుంది: అవన్నీ పూర్వపుమాటలోయ్—ఇప్పటి రకాలందరూ, పెంచుకొనే బాపతుకాదు.’

‘సరే, పెంచుకోండి, ఏమన్నా చేసుకోండి—మీరు చెడ్డదికాకుండా కవిత్వాన్ని ఓకన్నెనుచేసి, దాన్ని చెడగొడుతున్నారు.’

‘అక్కడే మళ్లా పొరబడుతున్నావు—అందరికీ తలో కన్నేనూ—అసలు పిల్ల ఒక్కతే: ఆమెను

ఏమహానుభావుడో ఎవరికీ తెలియకుండా వ్రైలెక్కిస్తాడు: మిగతా దండంతా, ఆ అమ్మాయికి పింకల్లి పెత్తల్లి బిడ్డలోయ్—ఏవరైతేనేం—రక్తస్పర్శ ఉంచేసరి.'

'కనుక,'

'ఇంతదూరం వచ్చినా మళ్లా మొదటికేనా?—తీరుబడిగా ఆలోచించుకో. నిమ్మళంమీద నీకే అర్థమవుతుంది—'శృంగారీచేత్' మొదలైన వాక్యాలన్నీ సరీగా అర్థంచేసుకోకుండా ఎందుకూ వాదిస్తావూ?'

సుందరం అంతటితో అనుగ్రహించి విడిచిపెట్టాడు—అతనువెళ్లిపోయిన చాలా సేపటిదాకా నవ్వుకుంటూనే ఉన్నాను.

చిన్నప్పటినుంచీ ఎరుగున్నాను సుందరాన్ని. ఎప్పుడూ ఇంతే! అన్నీవిపరీతం ఆలోచనలు: కొత్తగా మాట్లాడేవాడు మాత్రం కొంతసేపు ఉక్కిరిబిక్కిరవుతాడు—ఓమాదిరిగా ఎరుగున్నవాడు 'క్రాక్' ఏమోనను కొని జాలిపడతాడు: ఏమైతేనేం మొత్తంమీద చాలా చురుకైనవాడు—అక్కరకు రావలసినవాడు:

ఉన్నట్టుగా ఉండి—కవికిప్రత్యేకంగా ఓ కేష ముండాలని సుందరానికి సూచించింది: వెంటనే వెనుకటి ఫక్కీ—అంతామార్చేసి క్రొత్తపద్ధతిని తయారయినాడు. అసలే చక్కనివాడు: అంతకన్నా చక్కగా అలంకరించుకునేవాడు: ఆతను దోవను పోతూంటే చూసి, మెచ్చుకొని,—'ఇట్టిమనోహరాంగుడొకడెందయినన్ కలడే?' అన్నపద్యం భావాన్ని స్మరించని—పడుచుపిల్లలుండరనుకంటాను.

సుందరానికి లక్షణవతియైన భార్య ఉంది: అనుభవించడానికి కావలిసినంత ఆస్తి ఉంది: హాయిగాతిని, ఇంటిపట్టున కడుపులో పాలు కదలకుండా కూర్చోక ఏమిటా ఈవేషాలన్నీ అని ఒకొక్కప్పుడు నాకు కోపం వచ్చేది: కాని ఏం లాభం? నాచేత నేమవుతుందీ? అతను తనకుతోచినంత తానుచేయడమేకాని.

ఇంకొకరు ఏమనుకున్నా—ఏం చెప్పినా—లక్ష్యంచేసేవాడుకాడు; వినేవాడలా కాడు:

౨

అప్పటికి అరగంటనుంచీ కనిపెడుతున్నాను: సుందరం అలాగే కదలకుండా—నిల్చునే ఉన్నాడు:

నాకు కనబడి వారం అయింది అప్పటికి. ఎక్కడికన్నా వెళ్లాడేమో ననుకున్నాను: నాకోసమేవస్తూ—అక్కడ ఆగిపోయి ఉంటాడు — అందులో ఆశ్చర్య మేమీ లేదు. సుందరం, ప్రకృతిదేవత సౌందర్యాన్ని ఉపాసించే జట్టులో ఒకడు: ఒక్కొక్కనాడు అన్నమాటకూడా మరచిపోయి, ఆకాశంలో మబ్బు బాగుందనుకంటూనో, నక్షత్రాలు మినుకుమంటున్న వనుకుంటూనో, నిలుచున్నచోటనే రెప్పవేయకుండా రాత్రంతా గడిపేవాడు.

వెన్నెల బాగావచ్చింది. చందమామ నాకే చూడటానికి చాలా ముచ్చటగా ఉన్నాడు:—పరివేషం మరీ అద్భుతంగా ఉంది: మేఘాలన్నీ బాలచంద్రుడు తాకుతాడేమోనని పతివ్రతలలాగా పరుగెత్తుతున్నాయి: కొబ్బరిచెట్లు—చేయితాకి నాకొంత వాసేనని—కొనలు చాచి అందుకోవాలెనని తంటాలుపడుతున్నాయి—ఆ మనోహరదృశ్యాన్నంతా చూస్తూ, తలన్నా త్రిప్పకుండా అక్కడే నిలుచున్నాడు సుందరం.

ఆ—మనోహరదృశ్యం—

అద్దాలతలుపులమీద ఆమెనీడ పడుతూంది—మేడమీంచి గ్రామోఫోను వినబడుతూంది:

చూసినకొద్దీ నాకు అనుమానంగానే ఉంది-కాని-ఏమో, ఏటు చెప్పడానికీ వీలులేదు:

ఫోను పాటచాలించింది:—లోపల దీపకాంతి కూడా—తగ్గింది:

—రోమియో జూలియట్‌లో సీను సాక్షాత్కరించింది:

తెల్లనిచీరె కట్టుకుని, వెన్నెట్లోకూడా తళతళలాడి పోతూ—ఆమె—బాల్కనీలోకి వచ్చి నిలుచున్నది-

ఇక చూడనక్కరలేకుండానే సంగతేమో తెలిసిపోయింది:—ఏముందీ, సుందరం, పైకి ఎక్కివెళ్లి—

కాదు, నేనే పొరబడ్డాను: సుందరం నిలుచున్న చోటినుంచి కదలలేదు: ఆమెమాత్రం–రెండునిమిషాలు ఆలా నిలుచుని, తరువాత లోపలికి వెళ్లి తలుపు వేసుకున్నది:

దీపం సాపుగా ఆరిపోయింది:

సుందరం అక్కడనుంచి బయలుదేరాడు. మొదట, తిరిగివెళ్లిపోవాలనుకున్నాడు కాబోలు, ఇంటిదోవ బట్టాడు, కాని మళ్లా ఏ మాలోచించుకున్నాడో, చప్పున వెనుకకుతిరిగి, తిన్నగా మాయింటికి వచ్చేశాడు:

నేను అతను రావడం కనిపెట్టి ఏమీ ఎరుగనట్లుగా సిగరెట్టు కాల్చుకుంటూ కూర్చున్నాను — మధ్యమధ్య కూనిరాగంలో, 'మేరెమాలాబులాలో,...అనుకుంటూ_

—నన్ను పలుకరించలేదు: వచ్చి ఎదురుగా కుర్చీలో కూలబడి, చేజాచి, బల్లమీద, 'శ్వేతకాష్ఠం' ఒకటి అందుకున్నాడు_నేనూ చూస్తూ ఊరుకున్నాను.

'ఎక్కడనుంచి మొదలుపెట్టనూ, కథ' అని ఆతనే ఎత్తుకున్నాడు కొంచెంసేపటికి.

నేను దానికి జవాబు చెప్పకుండా,

'ఈమధ్య నీవు ప్రకృతిని ఉపాసించడం మానేసి'—

'అవునోయి_ప్రకృతిని కొన్నాళ్ల దాకా మరచి పోవాలిసివచ్చింది_చైతన్యాన్ని...'

నాకు నవ్వువచ్చింది.

'సరేలే—కథ నీవు చెప్పాలి? _ నేను గ్రహించ లేనూ!' అన్నాను.

'అందుకనే నేను చెప్పేది. నీవు తిన్నగా చూస్తే కాదూ సరిగా గ్రహించేది.

'తిన్నగానే చూశాను_కాని నీవనేదేమో మాత్రం గ్రహించలేను'

'పోనీ అక్కడికి కొంతనయమే—వింటావా?'

నేను తల ఊపాను:

'ఆ_అనసూయ–కీ–నాకూ, స్నేహం లేదు_తెలిసిందా.'

'అంటే'

'నీవుచూసింద్రాన్ని బట్టి– నిన్న నేనుచూశానులే_ నీవేమి అనుకుంటావో, అది కాదంటున్నాను';

నేనేమీమాట్లాడలేదు.

'క్రిందటి మంగళవారం నాడు–మీయింట్లోనే భోజనంచేశాను–జ్ఞాపకం ఉంది కదూ.'–ప్రొద్దుపోయే దాకా 'హిందూ' చదువుకుంటూ కూర్చున్నాను. నీవు అప్పుడే నిద్రపోయినావు—

—పడుకున్నవాడిని లేపడం ఎందుకని, నీతో చెప్పకుండానే వెళ్లిపోయినాను. అప్పటికి పన్నెండు దాటింది.

'ఎవరోపెళ్లివారు-అక్కడ ఆగారు. కాన్సర్టు, 'వేణుగానలోలా–' మాపోగ్గావాయిస్తున్నారు. వినడంతోనే నిద్రంతా అమాంతంగా మాయమయింది నాకు. అక్కడనుంచి కదలడానికి మనసు ఒప్పిందికాదు.

'పైకి—ఊరికేనే_చూశాను: అనసూయ నిలుచుని ఉంది:'

'అదివరకు చాలా సార్లుచూశాను, కాని ఎన్నడూ అంత అందంగా కనబడలేదు. చూపు మరల్చనే లేకపోయినాను. చూసినవాళ్లేమనుకుంటారో అన్న తలపే లేకపోయింది.

'నేను తెలివితెచ్చుకొనే టప్పటికి_పెండ్లివారు చాలాదూరం సాగిపోయినారు. రోడ్డుమీద కూడా ఎవరూ లేరు.'

'కాని ఆమె ఇంకా అక్కడనే నిలుచున్నది.

'తలుచుకుంటే నాకే సిగ్గువేసింది. ఆమె నన్ను కనిపెట్టే ఉంటుంది. ఏమనుకుందో'.

'ఇక అక్కడ నిలువలేకపోయినాను. ఇంటికి ఎట్లావెళ్లానో నాకే తెలియదు–ఎట్లా తెల్లవారిందో'

'మరచిపోదామనుకున్నాను. ఆలాటి పాపపు తలపులు చేరనీయరాదనుకున్నాను–కాని, నామనసు నావశం మీరిపోయింది. ఆమెను చూడకుండా_ఆమెను తలచుకోకుండా_ఉండటం దుర్లభమనిపించింది.

'బయటికి రావడానికి చాలాసిగ్గువేసింది — ఎవరికన్నా తెలిసిందేమో — ఏమనుకుంటారోనని, చాలా తపించాను'.

'కాని నావశము కాకపోయింది. ఇంట్లో కూర్చోలేకపోయినాను. పవలల్లా ఏలాగో వేగిరించి, చీకటిపడగానేవచ్చి అక్కడే నిలుచుంటున్నాను.

'క్రమంగా నాకు తగనిధైర్యం వస్తూంది. ఎవరన్నా లక్ష్యంలేకుండా పోతూంది — ఆమే — ఆమెతప్ప లోకమే లేదు నాకిప్పుడు—'

నేనాతనిమాటకు అడ్డు రాకుండా, వింటూ కూర్చున్నాను. విన్నకొద్దీ—అతని ఉద్రేకాన్ని చూసినకొద్దీ—భయంవేసింది.'

'ఏమంటావు?' అని అడిగాడు సుందరం.

ఏమంటాను—నీవు చేస్తున్నపని అంత బాగుండదేమో—

'ఎవరికి?'

'లోకానికి'

'నీకున్నూడానా?'

'నామాటకేం లే'

'నేను అడిగేది నీమాటే'

ఇక తప్పించుకోడానికి వీలు లేక పోయింది. చూస్తూ ఊరుకోలేక పోయినాను.—

'సుందరం—నా అభిప్రాయం మాత్రం'—

'నేను తప్పు చేస్తున్నాననేనా?—'అని అతడు అందుకున్నాడు.

'అవును.'

'అయితే ప్రయోజనం లేదు—నీవు అర్థంచేసుకోలేవు?'

'ఈపట్టున నీకు అర్థంకానివి—నీవు గ్రహించనివి కూడా కొన్నివిషయాలున్నాయి— తెలుసునా?'

'ఏమో, నాకు తెలియదు—తెలియనక్కరలేదు—కాని—నా ప్రేమా—నా ఆవేదన—సంగతి నీకెల్లా తెలుస్తుందీ?'

నేను 'నిజమే'నని తల ఊపాను.

తరువాత ఎవరమూ ఏమీ మాట్లాడలేదు.

## 3

రామమూర్తిగారు పడుచుదనంలో చాలా చక్కగా ఉండేవాడట—కాని నేనెరిగినప్పటినుంచీ ఆలాగే ఉన్నాడు—పిలకజుట్టు, సగంనెరిసిన గడ్డం—ముడతలుపడ్డమొగం.—ఏమో, అప్పటి ఆకారాన్ని చూసి ఊహించనైనా లేకపోయే వాణ్ణి, వయసులో ఉన్నప్పుడు ఎట్లా ఉండేవాడో.

మావైపునుంచే రోజూ కారులో కోర్టుకివెళ్లేవాడు. ఆయన్ని చూడటం వ్యవధానంగానే మాముసలమ్మ—'ఎల్లా ఉండేవాడనుకున్నావు? సరిగా దొరలాగా,—ఆమీసాలూ, ఆకుదురూ—నల్లలాంగ్‌కోటు, జరీతలగుడ్డ, పెట్టుకుని నడుస్తుంటే, వీధంతా కలకలలాడిపోయేది.—ఈనాటిమాటా,—ఇప్పటికి ముప్ఫైఏండ్లకిందట—అప్పుడు మీతాతయ్యా సబుకోర్టులో పనిచేస్తుండేవాళ్లూ—నీవేం ఎరుగున్నావు. మీ అమ్మేంచంటిపిల్ల......,—అని ఆయన్ని ప్రశంసించడం మొదలు పెట్టి, సొంతకథలోకి దించేది. నేను విసుగుకుని అక్కడనుంచి లేచిపోయే వాణ్ణి.

అనసూయ అయినయింటిపిల్ల. చాలాచక్కనిదీ, చదువుకున్నదీ. ఆ అమ్మాయికీ, రామమూర్తిగారికీ అధమం మూడు పుష్కరాలన్నా తేడా ఉండచ్చు వయసులో.

—లోకంలో పాటుకథే. రామమూర్తిగారికి మొదటిభార్యతో వియోగం కలిగిన తరువాత, చాలా కాలం ఒంటరిగానే ఉండిపోయినాడు. ఏకాకో లేచి పోతాడేమోననుకునేవాళ్లుకూడాను. కాని ఉన్నట్లుగా ఉండి ఎవరికి తెలియకుండానే, ఇట్టె పడుచుభార్యను సంపాదించుకువచ్చాడు.

అనసూయను వీధిమొగం చూడనీయడనీ, చాలా కొరంటికం పెడుతాడనీ, కొడతాడనీ—పడుచుభార్య లున్నముసలివాళ్ల కబ్బేదుర్బుద్ధులన్నీ ఉన్నాయనీ—అందరూ చెప్పుకునే వారు.

రూపాన్ని కాకుండా, గుణాల్ని వరించే పిల్లలు కూడా ఈకాలంలో ఉన్నారని నమ్మేరకం కాదు నేను. అయినా అనసూయ విషయంలో ఏమనుకోవడానికీ పాలుబోలేదు. అప్పటివరకూ పొల్లుమాట బడకుండా, మానవతి గానే కాపురంచేస్తున్నది.

నేనామెను ఎన్నడూ సరిగా చూడనన్నా లేదు. అసలు ఆ అమ్మాయి సాధారణంగా కనబడదుకూడాను. మాయింటికిదగ్గరే కనుక, ఎన్నడన్నా, ఏడుపుమాత్రం వినిపించేది. రామమూర్తిగారు—ఆకిరాతుడు- ఆఅమ్మాయిని తరుచు హింసించేవాడు.

సుందరంగాథ విన్నప్పటినుంచీ, నాకూ ఆమె అంటే కులాసాపుట్టింది —'నపరిహార్యేవస్తుని పౌరవాణాం మనః ప్రవర్తతే'—మావాడికికూడా మనసు మారిందంటే, ఆమెసామాన్యురాలై ఉండదన్నమాటేకాదూ?'

సుందరం, స్త్రీజనం విషయంలో ఆసలు చాలా జాగ్రత్తగా ఉంటాడు.—అపట్లమాత్రం చంచలుడుకాడు. ఆతడు అనసూయను వరించాడంటే—నాకు ఆశ్చర్యం వేసింది మొదట.

కాని సందేహ మేమీ లేదు. నిజంగా సుందరం వంటివాడికి తగిందే. ఆమెకూ ఆతనే తగినవాడు.—ఈ యుగంలో వీలులేదు కనుకగాని—ఏహంసో మధ్యరాయబారం నడుపుతే ఎంతో త్వరగా తేలిపోయేది కదా ఏదో ఒకటి అనిపించేది.

నేనాతనికి సహాయమూ చేయదలచలేదు. వారించదలచనూలేదు—చూసి సంతోషిద్దామనుకున్నాను.

... ... ... ...

అకాలజలదోదయమయింది.

సుందరం పరుగెత్తుకుంటూ—నిజంగా పరుగుగుతోనే—వచ్చాడు. వేసవిలోకన్నా ఎక్కువగా ఎండ కాస్తూంది. నేనూ అప్పుడే కాఫీ పుచ్చుకుని—నిద్రపోవాలనుకుంటున్నాను.

అమాంతం వచ్చి వెన్నమీద చరిచాడు. మత్తంతా వదిలిపోయి లేచి కూర్చున్నాను. ఆతనుమాత్రం కూర్చోకుండా—ఒకచోట నిలవకుండానే.—

'లేవోయి – షర్టువేసుకుని బయలుదేరు,—త్వరగా—లే—అలా చూస్తావేం'—

అని గబగబ నన్ను హెచ్చరించి, ఉత్తరీయము, షర్టు తీసుకువచ్చి నామీద పడేశాడు.

'ఏమిటీహడావడి?' అని నేను చాలా తీరుబడిగా అడిగాను, ఆతని తొందరంతా లెక్కపెట్టకుండా.

'కాదు-దోవలో చెపుతాను ముందుబయలుదేరు.'

'సంగతేమో తెలియందీ, కదలను. అసలు ఇంకోరైతే, ఇప్పుడు లోనికి రానిచ్చేవాణ్ణేకాను. ఏమిటి ఎండలో నన్నుకాస్సేపు పడుకోనీయకుండా.'

'ఎప్పుడూ నీతో ఇంతేనోయి' అని బిక్క మొగంవేసి, కూర్చున్నాడు సుందరం.

కొంచెంసేపు తలవంచుకుని ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఊరుకుని,

'రామమూర్తి—రమ్మన్నాడోయి మన్ని' అన్నాడు చప్పున తలఎత్తి నావైపుచూస్తూ.

'ఏమిటీ?'

సుందరం మళ్లా చెప్పాడు.

'నిజంగానా?'

'ఇంకా నమ్మకపోవడమేనా.'

'సరే వెళుదామా.'

'తప్పకుండా—నీదే ఆలస్యం'

—'కారణం ఏమిటో'

'ఏమయినా, నాకులక్ష్యంలేదు—అనసూయ...'

'కనిపెట్టాడా?'

ఎన్నడో కనిపెట్టాలిసింది. అది ఆతనిపొరబాటే'

'దుర్మార్గుడు; మనంకాస్త జాగ్రత్తగా'

'అయితే లెక్క ఏమిటోయి—ఆతనితో చెప్పే—అనసూయను—లాక్కుంటాను.'

'అన్యాయమేమో'

'ఆతను చేసేదానికంటేనా?'

—ఇద్దరమూవెళ్లి రామమూర్తి లైబ్రరీలో కూర్చున్నాము. లోపలికి కబురుపంపించాము.

నే నదివరకు ఎన్నడూ లోపలికి వెళ్లలేదు. ఆయనకు అంత మంచి లైబ్రరీ ఉన్నదని కలలోనన్నా అనుకోలేదు. పాతవకీళ్ల దగ్గర ఉండేసరంజామా అనుకున్నానుగాని—చూసేటప్పటికి నాకు తలతిరిగిపోయింది.—పేరున్న ఆధునికుల గ్రంథాలన్నీ మంచిప్రతులు, ముద్దులు మూటగడుతూ అలుమారల నిండా ఉన్నాయి.—

లోపలికి రమ్మని నౌకరువచ్చి చెప్పాడు. సుందరం, నేనూ,—లోపలికి వెళ్లాము.

డ్రాయింగురూము—ఫొటోగ్రాపులలోనే కాని ప్రత్యక్షంగా ఎన్నడూ అలాటిది చూడలేదు—ఎంతో బాగుంది—నాకు లోపలికి వెళ్లడానికే అదేదో అనిపించింది.

రామమూర్తిగారు ఛెస్టర్‌ఫీల్డులో కూర్చుని ఉన్నాడు. ప్రక్కన ట్రేలో కాఫీ సామగ్రి అంతా ఉన్నది.

మమ్మల్నిచూసి, లేచి ఎదురుగుండా వచ్చాడు. సబహుమానంగా లోపలికి తీసుకునివెళ్లి కూర్చోబెట్టి తానుకూడా మాకు ఎదురుగా కూర్చున్నాడు, చేతులో పుస్తకం ప్రక్కన పెట్టేసి.

అందరమూ కాఫీ పుచ్చుకున్నాము.

అంతవరకూ సుందరం ఏమీ మాట్లాడలేదూ—నేనూ ఏమనడానికి తోచక ఊరుకునే ఉన్నాను. రామమూర్తిగారే మాట్లాడుతున్నారు ఏవో ఆమాటలూ—ఈమాటలూను.

ఆయన మొగం, వాలకంచూస్తే, మోసమేమీ స్ఫురించడంలేదు, కాని నాకాయనఎదుట ముండ్లమీద కూర్చున్నట్టుగా ఉంది. ఎప్పుడు బయటపడుదామా అనుకుంటూ, విధిలేక తప్పని సరిగా కూర్చున్నాను.

‘అనసూయా!’

రామమూర్తిగారు నెమ్మదిగా పిలిచారు. నాకు గుండెలు ఆగిపోతాయేమో ననిపించింది. నిలువున నీరైనాను. సుందరంస్థితి గమనించడమే లేదు.

గాజులుచప్పుడు వినబడ్డది. గుమ్మానికి అడ్డమున్న తెరతొలగించుకొని అనసూయలోపలికి—

—రాలేదు. ముందరికి అడుగువేయబోతూ, మమ్మల్ని చూసి, చప్పున లోపలికి పోయింది.

‘పరవా లేదు—రా.’

ఆమె తలవంచుకునివచ్చి దూరంగా నిలవబడినది. నాకు నిజంగా భయంవేస్తూంది. ఆమెమొగంలో మాత్రం ఆశ్చర్యం కనబడుతూంది.

రామమూర్తిగారు లేచి నిలుచున్నారు. అనసూయ ఆయనకు చాటుగా ఉంది. మాకు కనిపించడం లేదు.

‘కష్టమనుకోకుండా పిలువగానే వచ్చారు. కృతజ్ఞుణ్ణి’ అని రామమూర్తిగారు ఎత్తుకున్నారు.

నాకు ఏంజవాబుచెప్పవలెనో తోచలేదు. అసలు అవసరం లేదేమో కూడాను. మాట్లాడకుండానే కూర్చున్నాం.

‘సుందరంగారూ, మిమ్మల్ని నేను చిన్నప్పటి నుంచీ ఎరుగున్నాను. మీనాయనగారికీ నాకూ, ఒకప్పుడు స్నేహంకూడా ఉండేది.

సుందరం తెల్లబోయి ఆయనవైపే చూస్తున్నాడు.

‘—మీకన్న వయసు చెల్లినవాడిని గనక, రెండు ముక్కలు వేదాంతం మాట్లాడుతాను, విసుపుకోబోకండీ—మానవుడికి ఆయుఃప్రమాణము శతాధికం అని నిర్ణయం ఉన్నా, విధిదుర్విజ్ఞేయం కాగండీ—శంకరుడు జీవనం విద్యుచ్చిరమనే అన్నాడు. అనుభవం విషయంలో లోకాయతికులమతమే నాకు నచ్చిందండీ—ఏమంటారు!’—’

మేమేమీ అనలేదు. ఆయనే అందుకున్నాడు—

‘ఇకమామూలు ధోరణిలోకివస్తాను:—కులాసా రెండు విధాలని నా ఊహ—సొంతం, పరకీయం అని అంటే, తాననుభవించడం, ఎవరినన్నా చూసి ఆనందించడం. ఎవరి అదృష్టాన్ని బట్టి ఎవరికివారికి—ఏదో, ఈ రెండు రకాల్లో, ఒకటి—

సుందరం రెండుమూడుసార్లు మాటకు అడ్డం రాబోయినాడు. కాని రామమూర్తిగారు మాట చొర

నీయలేదు. ఇక ప్రయోజనం లేదని, మాట అందుకోడానికి యత్నంమానేసి, అభినయంతో, తన అభిప్రాయం తెలియజెప్పాలని తంటాలుపడుతున్నాడు. ఆయన అది గ్రహించాడు కాబోలు చిరునవ్వుతో—

'నాయనా తొందరపడకోయి! నీకు నాలో మూడవపాలు వయసుందీ?-వస్తున్నానుకదూ?' అన్నాడు,

నాకిక ఆబిగివిని కూర్చోడం దుర్భరమయి పోయింది. అప్పటికి పదినిమిషాలనుంచీ వింటూన్నా కని బెడుతున్నా, మాటలధోరణేమిటో, మనసులో ఏముందో—ఏమీ—గోచరించనేలేదు. ఆయనసమక్షంలో ఉండటమే యాతనగా ఉంది. ఆచూపు—

ఆచూపు తమాషాగా ఉంది, కాని అర్థం అయేటట్టుమాత్రం లేదు మా ప్రజ్ఞలన్నీ మా ఆధీనం దాటి పోతూన్నాయి.

—అది అంతకన్నా చిత్రంగా ఉంది!—ఇప్పుడు గాంభీర్యం ఉట్టిపడుతూంది ఆముఖకవళికలో. ఆ-ధీరుడు ఓమాదిరిగా, దుర్నిరీక్షుడుగా ఉన్నాడు—మారిపోయి నాడు.

'అనసూయను నీవు ప్రేమిస్తున్నావుకాదూ?'

పిడుగుపడింది:—కాని ఆయన చలించలేదే?

'అడుగనక్కరలేదు—నీకు—ఆ—మె—మీద చాలా ప్రేమ ఉంది—నాకు తెలుసును.'

అగ్నిపర్వతం అడుగంటా కదిలి పోయింది:— తప్తధాతుప్రవాహం ముంచుకువస్తుంది.

—సుందరం కూర్చున్నచోట నుంచి లేచి— ఎగిరి—నిలుచున్నాడు—వణకిపోతున్నాడు. కళ్లు, భావ—కవిత్వ—రాగాన్ని క్రక్కుతూన్నాయి.

రామమూర్తిగారూ—నేను అనసూయను...... అనసూయ నీది—నాకు కావాలి—........ ఆబంగారు బొమ్మను—మీరు—మీరు—ఆమెకు మీరు తగరు—ఆమె జీవితాన్ని పాడుచేస్తున్నారు. ఆలావణ్యరాశి—ఆ....,

రామమూర్తిగారు ఈథూకుడు చకితుడైనా కాలేదు. చిరునవ్వు—నిజంగానే—చిరునవ్వు నవ్వాడు—

'అవునోయి—ఆమెనీకు కావాలి; నేనుసంతోషంగా అనసూయను, ఆమె ప్రేమను ఆశీర్వచనపురస్సరంగా నీకిచ్చివేస్తాను. హృదయపూర్వకంగా ఆమెను ఆమె వరించిన అదృష్టశాలిదగ్గరకు బ్రహ్మరథంపట్టి తీసుకుని వెళుతాను. నీవు పోషించనక్కరలేదు. నాకు కలిగిన దంతా ఆమెదే. ఇప్పుడే ఆమెకు యిచ్చివేస్తాను. ప్రేమేకాదూ, నీవు కోరేదీ, నీకు కావలసింది?—'

విన్నాం ఈమాటలన్నీ విన్నాం. కాని అప్పటి మాస్థితి ఏలా తెలియజేయడం?

నీలాంబుదాలమాటునుంచి తొంగుకుతూ ఉన్న విద్యుద్వల్లి తెరతొలగించుకుని మాకళ్లయెదుట మెరిసింది.

చెంగున ముందరికి దుమికింది. అప్పటికి మేం అనసూయ మాటే మరచిపోయినాం. రామమూర్తిగారు కూడా.

ఆయనకూడా ఈధోరణిలో ఆమెను గమనించడమే లేదు. అమాంతం, ముందుకు ఉరికి ఎదుట నిలువబడేటప్పటికి ఎంత నిగ్రహమున్నా మాలాగే ఆయనా ఉలిక్కిపడ్డాడు.

'ఏమిటీ ఆగడం?'

ఎవ్వరమూ మాట్లాడలేదు. మెదలనన్నా లేదు.

'అనసూయో!'

రామమూర్తిగారు చాలా ఆశ్చర్యపడుతూన్నారు. ఇక అనసూయో.

ఆచూపులు, ఆచూపులకి అర్థం తెలియడం లేదు కాని ఆమెకళ్లయెదుట పడుటకన్న ఏమైపోయినా బాగుండుననిపిస్తూంది. ఆకోపం—ఆవిషాదం;

'అభిమానంలేదూ. మీభార్యను పసు డెవ్వడో మెచ్చుకున్నాడని ఆ—ఆతనికి దానంచేస్తారా? పశువుల్లో పక్షుల్లో కూడా లేదే ఇంతధర్మబుద్ధి?

రామమూర్తిగారు అనసూయన తేరి బార చూశాడు—

'వెళ్లవా?—నీ జీవితాన్నంతా వ్యర్థం చేసుకుంటావా?—నీవు సుఖపడటమే నేనుకోరేది—నీమీద ప్రేమ'—

అనసూయ ఆడుపులిలాగా గర్జించింది—

'నామీద—ప్రేమ—అవును, నిజంగానే—నామీద మీకు ప్రేమ—దయ—ఆపేక్ష—ఎన్ని ఉన్నాయి!— పశువధ చేసేవాళ్లన్నా, ఆప్రాణిమీద కనికరిస్తారు — మీకా మాత్రమున్నా జాలిలేదే?

రామమూర్తిగారు తెలతెల బోయినారు.—

'అనసూయా—పొరబడ్డానా?' అని సంశయిస్తూ ప్రశ్నించాడు.

'మీరు తప్పుచేశారని—ఈదాసి అనగలదా, అనడానికి అధికారముందా?—కాని, ఇంతకాలమున్నా, నామనస్సు కనిపెట్టలేక పోయినారుకాదా?'

'నీవు—ఈ—ఈయననూ—'

'అవును. మీ మాటలన్నీ విన్నతర్వాత సంగతంతా తెలిసింది. నాకు తెలియకుండానే నన్ను ఇమిడ్చి ఎంతకథ అల్లారు.'

'ఏమిటే?'

'వీరు—ఎవరూ?'

అని మమ్మలను చూపించి అడిగింది.—నేనూ సుందరం తెల్లబోయినాము. మేము ఎవరమో కూడా అనసూయకి తెలియదా?

కాని రామమూర్తిగారికి కోపంవచ్చింది. ఆయనకు అనసూయమాటలు అర్థంకావడం లేదు కాబోలు!

'ఏం వేషాలూ—ఎవరో తెలియకుండానే,—ఆయన్ని—'

అనసూయ నవ్వింది.

'ప్రేమించావనేనా, మీరడుగబోయేది?'—

'అవును'—అని రామమూర్తిగారు తలఊగించారు.

మళ్లా—ఈమారు బిగ్గరగానే—నవ్వేసింది అనసూయ.

'అయితే—నేను ప్రేమించానా?—ఎవరినీ?'

'ఎరుగవా?'

'మీకు—తెలియదా?'

'తెలుసును. నేను—చూశాను. ఆవెన్నెల రాత్రుల్లో ఆతనికోసం నీవూ—నీకోసం ఆతడూ—పరితపించడం—'

'రామమూర్తిగారు ఉగ్రుడైపోయినాడు. మనసులో దాచలేక, కథంతా చెప్పేశాడు — నిత్యమూ సుందరం—అనసూయకోసం నిరీక్షించడం—ఆమె ఆతనికి కనబడటం—...

ఇంకా ఏవేవోమాట లన్నాడు—వింత వ్యాఖ్యానాలు చేశాడు—ఆ శాంతమంతా ఎక్కడికి పోయిందో.

అనసూయ అంతా విన్నది—

—'అలాగేం—ఒకరిని మించినవారొకరూ — మీరు ఆయన్ని చూశారు—ఆయన—నన్ను చూశారుకాదూ — సరే అంతవరకూ మీకథ బాగానేఉంది—ఒప్పుకుందాం—కాని మిమ్మల్ని ఇద్దర్నీ—నేను చూడలేదే?'

—ఇక ఎవరేం మాట్లాడుతారు?

'—చూడకపోవడం నాదిపొరబాటే — లేకపోతే ఇంతకథ ఏలాజరుగునూ. అయ్యో, వృథాగా ఎంతకష్టపడ్డారూ? నన్నడుగలేకపోయినారా? నా—నామీదనా మీ కపనమ్మకం. అంత విశ్వాసం లేకపోయిందా?'

'అవును ఏలాఅడుగతారు అబద్ధం చెపుతానేమోననుకున్నారుకాదూ. మీతో—మీతో అబద్ధమాడుతానని మిమ్మల్ని మోసం—మీకు ద్రోహంచేస్తానని ఏలా అనుకున్నారూ! అంతమాత్రం నన్ను నమ్మలేకపోయినారా? అబ్బ! మీది ఎంతరాతిగుండె!'

'మీఎదుటబడి ఇతరులున్నప్పుడు ఇంత నదురూ బెదురూ లేకుండా మాట్లాడడం తప్పే. నాకూ తెలుసును. కాని స్త్రీకి ఇంతకన్న గొప్పపరీక్ష ఏముంది. మీవంశగౌరవం, మీప్రతిష్ఠ, నన్ను కన్నవారిమర్యాద నేను కాపాడుకోవద్దూ?

'మీకూ తెలుసునుకాదూ. భోజనం అయినతరువాత నిద్రపోకముందు కాస్సేపు చల్లగాలిలో తిరిగే అలవాటు నాకుందని? నేను కాపురానికి వచ్చినప్పటినుంచీ మీరు చూస్తూనే ఉన్నారు. చిన్నప్పటినుంచీ కూడా అంతే. కావలిస్తే మావాళ్లని కనుక్కోండి.

చక్కగా వెన్నెలకాండి, చంద్రుడూ, నక్షత్రాలూ, మెరుస్తూ కనబడుతూంటే—క్రిందరోడ్డూ-రోడ్డు మీదపోయే మనుష్యులనీ చూడటానికి_ఎవరికి మనసొప్పుతుందండీ?_నాధ్యానంలో నేనుంటే-పాపం. ఆయన నన్ను చూసి ఉంటాడు:—

'వీరివేమం,వైఖరీమాత్రే కవిత్వంచెప్పేవారులాగా కనబడుతున్నారే_మీరూ,_ఓపిక లేక బయటికి అనకపోయినా_మనసులో ఉందికాదూ మీకును ఆధోరణి_కనుక ఇది మీరుభయులూ కలిసిచేసిన వంచనా?,

'_మా నాన్న అనేవాడు లేండి 'నిరంకుశాః కవయః'అని_మాచిన్నతనంలో సరిగా అర్థంచేసుకోలేక, ఈకవులందరూ, పగగా అ కుశం పెట్టి పొడిచిమంచిదోవలోకి తీసుకువచ్చేవాడు లేక ఈలా చెడిపోతున్నారనుకునేవాళ్లం—కాని బుద్ధి తెలిసినకొద్దీ. ఆ అన్యాయకపు ఊహలే నిజం అవుతున్నాయే?_మీర దరూ, నిజం చేస్తున్నారే?

'మీ ఆలోచనలో మంచి చెడ్డలు మీకు తెలియాలి-కాని'_అందరూ, మీలాగానే అనుకొని_అందరూ మీ అందుబాటులోవారనుకుని_వృథాగా కష్టపెట్టకండీ—మీరుకష్టపడకండి.'

వింటున్నకొద్దీ. కాళిదాసు శకుంతలచేత చెప్పించిన లెక్చరు, దీనిముందర చాలా నీరసంగా కనబడ్డది—నిజంగానే, చక్కని వాళ్లకు, కోపంకూడా అదోమాదిరి అందమే_

అనసూయ, ఈమాటలన్నీ రామమూర్తిగారికి ఎదురై అన్నది. ఇకచాలించి, మమ్మల్ని రక్షిస్తుందేమోననుకున్నాం—నేనుమాత్రం, నాజన్మనూ—దానికి కారకులనూ, మావంశానికి మూలపురుషులనూ, బాలారిష్టాలన్నీ తప్పించి ఇందాకా బ్రదుకనిచ్చిన దైవాలనీ_ఎంత తిట్టానో_తిడుతూన్నానో_ఎవరి కెరుక?

కాని, మా కంతటితో తప్పించుకుని బయటపడే భాగ్యం లేదు. రామమూర్తిగారి దిక్కునుంచి మా వైపుకు తిరిగింది ఆతుపాను. ఒక్కటే విసురు.

'అయ్యో! మీరెవరో ఎరుగను – క్షమించండి. కాని, మీతోబుట్టువునే, ఆమాదిరిగా_చూడటానికి మీ మనసు ఒప్పదనుకుంటాను_కాదూ?'

అని అన్నది మృదుమధురస్వరంతో – ఎంతో నెమ్మదిగా.

ఆదెబ్బతో మాయిద్దరిపనీ ఆఖరయిపోయింది. సుందరం నేనూ._ఎవరు ముందో, ఏలావచ్చి బయటపడ్డామో, తెలీదు.

నేను కాస్త వెనుకపడ్డాననుకుంటాను. రామమూర్తిగారు అనసూయయెదుట సాంజలియై క్షమార్పణ వేడటం, ఆమె ఆయన్ని తగనిప్రేమతో వారించడం చూశాను చూచాయగా.

సుందరం ఈమధ్య అసలే కనబడటంమానేశాడు. వేసవికి ఊటీ వెళ్లాడేమో?

ఆమాటే_ఆ అమ్మాయి మాటే ఆమె అన్న ఆ మాటే ఎప్పుడూ తలపువస్తూంటుంది. తలచుకున్నప్పుడల్లా నవ్వుకుంటూంటాను. నిజమే—ఒకరిని వించినవారొకరూ!

---

## ఒక నాటి గీతి

ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి గారు

ఎన్నియబ్దాలనుండో నాహృదయసుమము
 సమధికానందశాఖితో జంటఁబాసి
భగ్నమై ధూళియై తుది భస్మమయ్యె
నే సహింపంగలేక నిర్నిద్రనయన
జలదమాలాకవోష్ణంపు సలిలధారఁ
దడపిపదనిడఁజూడ దుర్దైవహతక